# రాష్ట్రం ఏర్పాటుతో ఉద్యోగుల తలరాతలు మారాయి..



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ, విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మోహన్‌రెడ్డి

బాన్సువాడ టౌన్, నవంబర్ 21: ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాత రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగుల తలరాతలు మారాయని మాజీ ఎమ్మెల్సీ, పీఆర్టీయూ రాష్ట్ర నాయకుడు, విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మోహన్‌రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ పార్టీకి మద్దతుగా బాన్సువాడ పట్టణంలో రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగుల అతిథి గృహంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా

**మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ, విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మోహన్‌రెడ్డి**

ఆయన మాట్లాడుతూ.. దేశంలో మరే ఇతర రాష్ట్రాల్లో లేని ప్రభుత్వ వేతనాలు ఒక్క తెలంగాణ రాష్ట్రంలో కల్పించిన ఘనత సీఎం కేసీఆర్‌దేనని అన్నారు. ఒక సారి 30, మరో సారి 43 శాతం పీఆర్సీని ప్రకటించి ప్రభుత్వ ఉద్యోగుల ఇండ్లలో వెలుగు నింపిన ఉద్యమ నాయకుడికి అండగ నిలబడాలని అన్నారు. స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డికి మద్దతుగా ఉద్యోగస్తులు, విశ్రాంత ఉద్యోగులు అందరూ తమ వంతు సహకారంగా ప్రచారం నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. మూడో సారి బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రాబోతుందని చెప్పారు. అధికారంలోకి వచ్చిన వెంటనే మరిన్ని వెసులుబాటులను ఉద్యోగులకు ప్రభుత్వం కల్పించనున్నట్లు ముఖ్యమంత్రి హామీ ఇచ్చారని అన్నారు. బాన్సువాడ విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు లోహిత్ రెడ్డి, కార్యదర్శి పరిగె మోహన్‌రెడ్డి, కాశీనాథ్, విశ్రాంత ఉద్యోగులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్‌లో పలువురి చేరిక



బీఆర్ఎస్‌లో చేరిన వారికి గులాబీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి

బాన్సువాడ టౌన్, నవంబర్ 21 : బాన్సువాడ పట్టణం పరిధిలోని పలుగురు యువకులు డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి సమక్షంలో స్పీకర్ స్వగృహంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారందరికీ డీసీసీబీ చైర్మన్ గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా డీసీసీబీ చైర్మన్ మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో 10 సంవత్సరాలపాటు జిల్లా, రాష్ట్ర స్థాయి ఏబీవీపీలో వివిధ పదవీ బాధ్యతలు నిర్వహించిన గడ్డమీది అంజాగౌడ్, అనుచరులు బీఆర్ఎస్ పార్టీలోకి చేరడంతోపాటు తన సంపూర్ణ మద్దతును తెలియజేసినందుకు అభినందిస్తున్నట్లు తెలిపారు. బాన్సువాడ నియోజకవర్గ అభివృద్ధి కేవలం బీఆర్ఎస్ పార్టీతోనే సాధ్యమవుతుందని అన్నారు. సీఎం కేసీఆర్ సహాయ సహకారాలతో మునుపెన్నడూ లేనివిధంగా రాష్ట్ర స్థాయిలో అభివృద్ధి జరిగిందని తెలిపారు. సీఎం కేసీఆర్ ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాలు, స్థానికంగా స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి అమలు చేస్తున్న విధానానికి ఆకర్షితులై వివిధ పార్టీల నుంచి భారీగా బీఆర్ఎస్ పార్టీలోనికి వస్తున్నారని అన్నారు. తమను నమ్ముకొని పార్టీలోకి వస్తున్న ప్రతి ఒక్కరిని కంటి రెప్పలా కాపాడుకుంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రైతుబంధు సమితి జిల్లా కన్వీనర్ దుద్దాల అంజిరెడ్డి, సీనియర్ నాయకుడు మహ్మద్ ఎజాస్, కార్యకర్తలు ఇందూరు శ్రీనివాస్, మేకల గంగాధర్, కిరణ్ చంద్ర, యశ్వంత్, సాయిబాబు, విజయ్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

## ఓటు హక్కును వినియోగించుకోవాలి



గేయాల పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పున్న రాజేశ్వర్

కామారెడ్డి, నవంబర్ 21: ప్రతిఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పున్న రాజేశ్వర్ అన్నారు. సీనియర్ సిటిజన్ భవన్‌లో ప్రముఖ కవి యెనిశెట్టి గంగాప్రసాద్ రాసిన 'నీ భవితకు నీ ఓటే కీలకం' ఓటు గేయ పుస్తకాన్ని, రికార్డింగ్ చేసిన రెండు పాటలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యెనిశెట్టి గంగాప్రసాద్ రాసిన పుస్తకం ఓటర్లను చైతన్యం తెచ్చే విధంగా ఉందన్నారు. కార్యక్రమంలో పుస్తక రచయిత యెనిశెట్టి గంగాప్రసాద్, రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ రాజన్న, కోశాధికారి జైహింద్ గౌడ్, పీతాంబర్, అల్లి మోహన్‌రాజ్, కాసర్ల రామచంద్రం తదితరులు పాల్గొన్నారు.

## పీఆర్టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శుల ఎన్నిక



నూతన అధ్యక్ష, కార్యదర్శిని సన్మానిస్తున్న పీఆర్టీయూ తెలంగాణ సభ్యులు

కామారెడ్డి, నవంబర్ 21: జిల్లాకేంద్రంలోని ఓ ప్రైవేటు కాలేజీలో మంగళవారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో పీఆర్టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులను ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అంబీర్ మనోహర్‌రావు, కార్యదర్శిగా జనపాల లక్ష్మీరాజ్యం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారానికి తమవంతు కృషి చేస్తామని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు నర్సింగరావు, మండలాల బాధ్యులు నర్సింగరావు, ప్రభాకర్, లెనిన్, సురేందర్, ఆనంద్, శ్రీధర్ రావు, వెంకట్, నరేశ్, సూర్య తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల నిర్వహణపై పీవో, ఏపీవోలకు శిక్షణ



ఈవీఎం నిర్వహణపై పీవో, ఏపీవోలకు శిక్షణ ఇస్తున్న ఎన్నికల పర్యవేక్షకుడు నారాయణ్‌సింగ్

బాన్సువాడ రూరల్, నవంబర్ 21 : బాన్సువాడ అసెంబ్లీ నియోజక వర్గ ఎన్నికల నిర్వాహణపై మంగళవారం మండలంలోని దేశాయిపేట్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బాన్సువాడ, బీర్కూర్, నస్రుల్లాబాద్ మండలాలకు చెందిన ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ తరగతులను ఏర్పాటు చేశారు. శిక్షణ తరగతులలో ఈవీఎంలు, వీవీ ప్యాట్‌ల నిర్వాహణపై ఎన్నికల పర్యవేక్షణ అధికారి నారాయణ్‌సింగ్ శిక్షణ ఇచ్చారు. ఈవీఎంలో సాంకేతిక సమస్యలు తలెత్తినప్పుడు చేపట్టాల్సిన చర్యలపై క్లుప్తంగా వివరించారు. బాన్సువాడ నియోజకవర్గ ఎన్నిల రిటర్నింగ్ అధికారి భుజంగ్‌రావు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి వరప్రసాద్. పీవోలు, ఏపీవోలు తదితరులు పాల్గొన్నారు.

## ఐఐటీ రాష్ట్రస్థాయి పరీక్షల్లో విద్యార్థుల ప్రతిభ

ఆర్మూర్, నవంబర్21: ఈ-అభ్యాస్ అకాడమీ హైదరాబాద్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన ఐఐటీ ఆర్ఎస్ఎం రాష్ట్రస్థాయి పరీక్షల్లో ఆర్మూర్ నలంద హైస్కూల్ విద్యార్థులు సత్తాచాటి ఉత్తమ ర్యాంకులు సాధించారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం తరపున విద్యార్థులను మంగళవారం అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్లు లక్కారం ప్రసాద్, సాగర్, ఉపాధ్యాయులు సందీప్, వాసవి, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలి

**రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్**



వీసీలో పాల్గొన్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు (ఇన్‌సెట్లో) మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్

ఖలీల్‌వాడి, నవంబర్ 21 : ఎలాంటి అనుమానాలకూ తావు లేకుండా ఎన్నికల ప్రక్రియను పూర్తి పారదర్శకంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ సూచించారు. అసెంబ్లీ ఎన్నికలను పురస్కరించుకుని మంగళవారం సా యంత్రం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఎన్నికల నిర్వహణతో ముడిపడిన వివిధ అంశాలకు సంబంధించిన నివేదికలను జాప్యం చే యకుండా సకాలంలో పంపించాలని ఆదేశించారు. 80 ఏండ్లుపైబడి వృద్ధులు, 40 శాతానికి పైగా వైక ల్యం కలిగిన దివ్యాంగులకు వారి ఇండ్ల వద్ద నుంచే ఓటుహక్కు వినియోగించుకునేందుకు వీలుగా చేపట్టిన ఏర్పాట్లపై ఆయా జిల్లా ఎన్నికల అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటుహక్కు వినియోగించుకునేందుకు రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్లు, పోలింగ్, కౌంటింగ్ కోసం చేపట్టిన కసరత్తుపై ఆరా తీశారు. పట్టణ ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాల్లో 100 శాతం, గ్రామీణ ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాల్లో 60 శాతం వెబ్‌క్యాస్టింగ్ చేయాలని, మిగిలిన పోలింగ్ కేంద్రాల బయట సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సీఈవో సూచించారు. నూతన ఓటర్లకు పోస్టల్‌శాఖ ద్వారా ఓటరు గుర్తింపు కార్డులు పంపిణీ జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు.జిల్లాలో ప్రతి ఓటరుకూ సమాచార స్లిప్పులు పంపిణీ చేయాలని, ప్రతిరోజు ఓటరు సమాచార స్లిప్పుల పంపిణీపై సమీక్ష నిర్వహించాలని సూచించారు.ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఈవీఎంల ర్యాండమైజేషన్ పూర్తి చేయాలన్నారు. పోలింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేసి వారికి శిక్షణ అందించారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఈవీఎంల డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాల వద్ద పక్కాగా ఏర్పాట్లు చేయాలని, ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం ఉండకూడదని సూచించారు.

**ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలి**

ఎన్నికల ప్రచారానికి సంబంధించిన సమావేశాలు, సభలు నిర్వహించుకునేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు, అభ్యర్థుల నుంచి, సువిధ పోర్టల్ ద్వారా వచ్చే దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ నిర్ణీత గడువులో అనుమతులు మంజూరు చేయాలన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనలపై వచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందిస్తూ ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయించాలని సూచించారు. వీసీలో కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మం తు, అదనపు కలెక్టర్లు చిత్రామిశ్రా, యాదిరెడ్డి, మున్సిపల్ కమిషనర్ మకరంద్, రిటర్నింగ్ అధికారులు రాజేంద్రకుమార్, వినోద్‌కుమార్ పాల్గొన్నారు.